క్లుప్తంగా

కేజీబీవీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నాగమణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన అసిస్టెంట్ కుక్–1, స్వీపర్ పోస్టులు–2 ఖాళీల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు సమగ్రశిక్ష బ్లాగ్‌డాట్‌కామ్‌లో దరఖాస్తు చేసుకుని సదరు కాపీని మే 1లోపు రాయదుర్గంలోని ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

టోల్‌గేట్ వసూలు వేలం వాయిదా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దేవదాయశాఖ పరిధిలోని రాణిఛత్రం (పాత బస్టాండ్)లోని ఖాళీ స్థలంలో వివిధ వాహనాల పార్కింగ్, తోపుడు బండ్ల వ్యాపారుల నుంచి టోల్ గేటు రుసుం వసూలు వేలం మే 1కి వాయిదా పడినట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. 19 మంది పాటదారులు టోల్ గేట్ వసూలు హక్కు పొందేందుకు రూ.లక్ష డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నట్లు చెప్పారు. శుక్రవారం వేలం దక్కించుకునే విషయంలో పాటదారుల మధ్య గొడవలు వచ్చాయి. ఇదిలా ఉండగా గతేడాది టోల్ గేట్ సుంకం వసూలును రూ.10 లక్షలకు కేటాయించగా, ఈసారి పాటదారులు సిండికేట్ అయి తక్కువ ధరకు దక్కించుకునేందుకు ప్లాన్ వేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఓ పాటదారుడు రూ.10 లక్షలకు వేలం పాట పాడేందుకు సిద్ధపడగా ఇతర పాటదారులు జోక్యం చేసుకుని గొడవకు దిగి వేలం రద్దు చేయించినట్లు తెలిసింది.

ఘనంగా కరిబసవస్వామి మండల ఆరాధన



జగద్గురు కరిబసవ రాజేంద్ర మహాస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక గవిమఠం మొదటి పీఠాధిపతి జగద్గురు కరిబసవ రాజేంద్ర మహాస్వాముల నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగి 40 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పూజా ఆరాధన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, పురోహితులు మొదటి పీఠాధిపతి విగ్రహానికి రుద్రాభిషేకం, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆకుకూర నాగరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్తరాధికారి చేతుల మీదుగా అన్నప్రసాదం ప్రారంభించారు.

సమ్మె జయప్రదం చేయండి

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న కేంద్ర కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ అనుబంధం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ మాట్లాడుతూ ప్రధానంగా లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం ఆధీనంలో ఉన్న రంగాలన్నీ ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి మోదీ ప్రభుత్వం పూనుకుందన్నారు. మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మిక లోకం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంత చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వన్నూరస్వామి, నాయకులు తిమ్మప్ప, వెంకటేశులు, శివ, వెంకటరమణ, ఎల్లక్క పాల్గొన్నారు.

గజ వాహనంపై శ్రీవారి దర్శనం



గజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వెలసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు గజవాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం నుంచి శ్రీవారికి వేద పండితులు పవిత్ర గంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి , అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గజ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు.

సస్యరక్షణపై అవగాహన

కుందుర్పి : మామిడి తోటల్లో సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. శుక్రవారం కుందుర్పి మండలంలోని అపిలేపల్లిలో వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రామయ్య మామిడి రైతులతో సమావేశమై అవగాహన కల్పించారు. మామిడి పంటలో రైతులు పూత, మొగ్గ దశలో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో కంబదూరు ఉద్యాన శాఖ అధికారి గౌసియా, సర్పంచ్ అతావుల్లా, రైతులు ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది.. డి హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో అధికార పార్టీ నాయకులు, అధికారుల అండతో ఇష్టారాజ్యంగా స్టోన్ క్రషర్లు నిర్వహిస్తున్నారు. రాయల్టీలకు ఎగనామం పెట్టి నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి తవ్వకాలు జరుపుతున్నారు. పర్మిట్లు లేకుండా కంకర టిప్పర్లను సైనం నడుపుతున్నారు. అయినా మైనింగ్, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

- ఇష్టారాజ్యంగా స్టోన్ క్రషర్ల నిర్వహణ
- నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి తవ్వకాలు
- రాయల్టీలకు ఎగనామం
- పర్మిట్లు లేకుండానే రోడ్డెక్కుతున్న కంకర టిప్పర్లు
- కన్నెత్తి చూడని మైనింగ్, రెవెన్యూ అధికారులు



నేమకల్లు సమీపంలోని క్వారీలో తవ్వకాలు (ఫైల్)

ఉల్లంగనులు

రాయదుర్గం: బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాల్లో సుమారు 52 క్వారీలు, స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ఇందులో మెజార్టీ క్వారీలు, క్రషర్లు కూటమి నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. క్వారీ లీజుదారులు విస్తీర్ణం కంటే మూడు, నాలుగు రెట్లు ఎక్కువగా కొండలను పేల్చేస్తున్నారు. బండరాళ్లను కంకర చేసి టిప్పర్ల ద్వారా కర్ణాటక రాష్ట్రం బళ్లారి, సండూరు, తోరణగల్లు, జిందాల్, హొసపేట తదితర ప్రాంతాలకు ఎలాంటి పర్మిట్లు లేకుండానే యథేచ్ఛగా తరలిస్తున్నారు. టిప్పర్ కంకర యూనిట్ ప్రకారం ప్రభుత్వానికి రాయల్టీలు చెల్లించాలి. కానీ ఈ నిబంధనలు పాటించకుండా డీ హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో నిత్యం వందలాది టిప్పర్లు తరలిస్తున్నారు. ఈ క్రషర్లలో బిహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన కూలీలు పనిలో ఉంటున్నారు. వారి వివరాలు ఏమీ నమోదు చేయించకుండానే పని చేయిస్తున్నారు. వారికి తోడుగా స్థానికులు కొందరు పని చేస్తున్నారు. పీఎఫ్, ఈపీఎఫ్ లాంటి సౌకర్యాలూ కల్పించలేదు. ఎక్కడా భద్రతా ప్రమాణాలు పాటించలేదు. కాలం చెల్లిన టిప్పర్లలో బండరాళ్లు తరలిస్తున్నారు. ఇటీవల సోములాపురం సమీపంలో ఓ క్రషర్ వద్ద గొర్రెలు, పశువులు మేపుకుంటున్న ఓ వ్యక్తి జిలెటిన్ స్టిక్ (పేలుడు పదార్థం) పొలాల్లో ఆరుబయట పడి ఉండటాన్ని గమనించి చేతిలోకి తీసుకున్నాడు. చేతిలోనే అది పేలి గాయాల పాలయ్యాడు. ఇలా వెలుగు చూడని ఘటనలు మరెన్నో ఉన్నాయని స్థానిక ప్రజలు చెప్పుకుంటున్నారు.



టిప్పర్‌కు రాయి లోడు చేస్తున్న దృశ్యం (ఫైల్)

యథేచ్ఛగా జిలెటిన్ స్టిక్స్ వినియోగం..

కొండను బ్లాస్టింగ్ చేసేందుకు లైసెన్స్ ఉండాలి. కానీ చాలా చోట్ల అనుమతులు కూడా లేవు. ఉండే వాటిలోనూ రెన్యూవల్ సక్రమంగా చేసినట్టు లేదు. తక్కువ పరిమాణంలో జిలెటిన్ స్టిక్స్ మందు ఉపయోగించి బ్లాస్టింగ్ చేసేందుకు ఒకరిద్దరికి మాత్రమే అనుమతి ఉందని అధికారులు చెప్తున్నారు. అయితే ఇక్కడ ఎక్కువ పరిమాణంలో పేలుడు పదార్థాలు, భారీ విస్ఫోటనం కలిగించే జిలెటిన్ స్టిక్స్, భారీ స్థాయిలో అమ్మోనియం నైట్రేట్ ఉపయోగిస్తున్నట్టు తెలుస్తోంది. డి హీరేహాళ్ పరిసరాల్లో మడేనహళ్లి, లక్ష్మీపురం, సాములాపురం, డి హీరేహాళ్‌తో పాటు బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ప్రాంతాల్లో రాయల్టీలు చెల్లించకుండా కంకర తరలిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

రాయల్టీలు ఎగ్గొట్టి..

బొమ్మనహాళ్ మండలం నేమకల్లు వద్ద టీడీపీ నాయకుడు ఓ కంకర క్వారీని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.కోట్ల బకాయికి ఎగనామం పెట్టారు. కొండలను కొల్లగొట్టి రూ. కోట్లు కూడగట్టిన ఈయనకు.. ఓ అధికార పార్టీ పెద్ద అండగా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. ఏదీ ఏమైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు డీ హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లోని క్వారీలు, క్రషర్ల తవ్వకాల పరిధిని పరిశీలించడంతో పాటు రోజూ తరలించే కంకరకు రాయల్టీలు చెల్లించకపోవడంపై తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అతిక్రమిస్తే చర్యలు

క్వారీలు, క్రషర్ల నిర్వహణ కచ్చితంగా నిబంధనలు పాటించాలి. ప్రభుత్వానికి రాయల్టీలు చెల్లించాకే కంకర తరలించాలి. లీజుదారులు పరిమితికి మించి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు చేపడతాం. ప్రతి క్వారీ, క్రషర్‌ను మైనింగ్, రెవెన్యూ సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాం. అక్రమార్కులు గుర్తిస్తే తక్షణం చర్యలు చేపడతాం. ఇటీవల మైనింగ్ డీడీ, వారి సిబ్బంది కూడా బొమ్మనహాళ్ మండలంలో పర్యటించి క్వారీ, క్రషర్లు తనిఖీలు చేశారు. త్వరలో డీ హీరేహాళ్ ప్రాంతాల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టి లోపాలు ఉంటే గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– మునివేలు, తహసీల్దార్, డి హీరేహాళ్



డి హీరేహాళ్ మండలంలో నడుస్తున్న క్రషర్



యంత్రాలతో బండరాయికి ఘాతం వేస్తున్న కార్మికులు

కొనకొండ్లలో ఎస్ఎస్ ట్యాంకు గట్టుకు పగుళ్లు

- మరమ్మతులు చేపట్టాలని కోరిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



నెర్రెలు చీలిన కొనకొండ్ల ఎస్ఎస్ ట్యాంకు గట్టు

ఉరవకొండ(వజ్రకరూర్): వజ్రకరూర్ మండల పరిధిలోని కొనకొండ్ల ఎస్ఎస్ ట్యాంకు గట్టుకు దాదాపు 28 చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. దాదాపు 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు ద్వారా నియోజకవర్గంలోని 17 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. ట్యాంకు గట్టు మొత్తం పగుళ్లు ఏర్పడి 1600 మీటర్లు పొడవు కలిగిన ట్యాంకు గట్టుకు బండల్ స్ట్రెంతనింగ్ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్ఎస్ ట్యాంకు గట్టు మరమ్మతు పనులు చేపట్టాలి:

కొనకొండ్ల ఎస్ఎస్ ట్యాంకు గట్టు మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. పగుళ్లు ఏర్పడి ట్యాంకు మనుగడకే ప్రమాదకరంగా మారినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం, అదనపు ట్యాంకు నిర్మాణం కోసం రూ.6కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈనిధులను ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం వినియోగించకుండా నానిప్పెడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని తక్షణమే ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా నిషేధమని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. మే 1 నుంచి పూర్తిగా ప్లాస్టిక్ కవర్లు నిషేధించనున్నట్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో హోటల్ యజమానులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ గ్లాసులను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. హోటల్ యజమానులు కూరలు, ఆహార పొట్లాలు, టీ, కాఫీలను పార్సల్ చేయడానికి ప్లాస్టిక్ విచ్చలవిడిగా వాడకంతో ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వ్యాపారులు పాల్గొన్నారు.

బీటీపీకి సాగునీరు తీసుకొస్తాం

గుమ్మఘట్ట: భైరవాని తిప్ప ప్రాజెక్టుకు సాగునీరు తీసుకొస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. రంగచేడు సమీపంలో బీటీపీ ఆయకట్టు కింద సా గు చేసిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులతో బీటీపీకి సాగునీరు తగ్గిపోవడంతో నీరులేక భూములు బీళ్లుగా మారాయన్నారు. హంద్రీనీవా నుంచి కృష్ణాజలాలను తీసుకొచ్చి సాగునీరందిస్తామన్నారు. అనంతరం కలుగోడులో నిర్మించిన గోకులం షెడ్డు ప్రారంభించారు. తహసీ ల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏడీఏ లక్ష్మానాయక్, ఏపీఓ సురేశ్ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం

కణేకల్లు: రబీలో వరి సాగు చేసిన రైతులకు వరి కొనుగోలు కేంద్రాలతో మేలు జరగనుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కణేకల్లులోని ఆదర్శ భారతి రైతుసేవా సహకార సంఘంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ, సివిల్ సప్లయ్ డీఎం రమేష్‌రెడ్డి, ఆర్డీఓ వసంతబాబుతో కలిసి ఎమ్మెల్యే వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, కణేకల్లు చెరువు సంఘం అధ్యక్షులు బీటీ రమేష్, మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఇద్దరికి గాయాలు

కూడేరు: అరవకూరు చెరువు మలుపు వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వడియంపేటకు చెందిన నాగార్జున, అక్కులన్నలు గాయపడ్డారు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఉరవకొండ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అదుపు తప్పి కింద పడ్డారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రాయదుర్గంలో కాలనీవాసులతో కలిసి అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



కొకుంట్ల పీహెచ్‌సీలో ర్యాలీని ప్రారంభిస్తున్న కడప జోనల్ మలేరియా అధికారి



కూడేరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారిణి సాహితీ, వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: దోమకాటుతో వచ్చే డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రాణాంతకమని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీధరఘట్ట, బొమ్మనహాళ్ పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీలక్ష్మి, కుమారారాజా ప్రజలకు సూచించారు.శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, శ్రీధరఘట్టల్లో మలేరియా దినోత్సవాన్ని వైద్య సిబ్బంది నిర్వహించా రు. ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సీహెచ్ఓ ఈశ్వరయ్య, రాజశేఖర్, సిబ్బంది శివ ప్రసాద్, ఉమాదేవి, శశికళ, నాగవేణి, అరుణ, ఇస్మాయిల్, చిలకమ్మ, రుక్మిణి, రోజా, శ్రీకాంత్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణదుర్గం రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ అమృత వర్షిని అధ్యక్షతన మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, మలేరియా జోనల్ అధికారి లక్ష్మానాయక్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటింటికీ మలేరియా, డెంగీ, ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా ఆఫీసర్ ఎంపీహెచ్ఈఓ నిత్య పూజయా వేణుగోపాల్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు యుగంధర్, ల్యాబ్ టెక్నీషియన్ మధు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన మనందరి బాధ్యత

రాయదుర్గంటౌన్: మలేరియా నిర్మూలన మనందరి బాధ్యత అని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు జశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్, ఆరోగ్య విద్యాబోధకుడు లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక 17వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, శానిటేషన్ సెక్రటరీ ఓంకార్, హెల్త్ సెక్రటరీలు ప్రమీల, శోభానళిని, రూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మలేరియా నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కడప జోనల్ మలేరియా అధికారి లక్ష్మానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఉరవకొండ సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డితో కలసి పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని కేసుల వివరాల నివేదికలను పరిశీలించి, వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంకతో కలసి వైద్య సిబ్బందితో ప్రాణాంతక వ్యాధి మలేరియా నుంచి నివారణతో రక్షణ కల్పించుకునే అంశాలను వివరించి క్షేత్రస్థాయిలో అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, విజయ్, సరోజ, వసంత, ఎల్‌టీ నవీన్, హెల్త్ అసిస్టెంట్‌లు వీరశేఖర్, అజయ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కడప జోనల్ మలేరియా అధికారి లక్ష్మానాయక్

ఉరవకొండ: మలేరియాను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కడప జోనల్ మలేరియా అధికారి లక్ష్మానాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని రాకెట్ల, కొకుంట్ల పీహెచ్‌సీ పరిధిలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీలు, అవగాహన సమావేశాలు నిర్వహించారు. మలేరియా దినోత్సవ ర్యాలీని ఉద్దేశించి లక్ష్మానాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, వైద్యాధికారులు పావని, అనికేత్, లక్ష్మీచందన పాల్గొన్నారు.

కూడేరు: దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు చేపడితే మలేరియాను అరికట్టొచ్చని మండల వైద్యాధికారిణి సాహితీ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని కూడేరులో వైద్యాధికారిణి సాహితీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్ వైజర్లురవీంద్ర, యశోద, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఫార్మసిస్టు వేణుగోపాల్, హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ



రాయదుర్గంలో వాల్మీకి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

రాయదుర్గంటౌన్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి పిరికిపంద చర్య అని, దాడికి పాల్పడిన ముష్కర్లను కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు బండి కిష్టప్ప కోరారు. శుక్రవారం వాల్మీకి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో బలైన వారికి సంతాపం తెలియజేస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. స్థానిక వినాయక సర్కిల్ నుంచి లక్ష్మీబజార్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన సాగింది. కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సేవా సంఘం నాయకులు మలకన్న, చంద్రశేఖర్, రవిచంద్ర, రాజ ప్ప, పైతోట రఘు, రామాంజనేయులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని లక్ష్మీబజార్ సర్కిల్‌లో యూటీఎఫ్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ముష్కరుల పట్ల కఠినంగా వ్యవహరించాలని నినాదాలు చేశారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని టీసర్కిల్‌లో కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లింలు నిరసన తెలియజేశారు. ముస్లింలు మాట్లాడుతూ ఉగ్రదాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.

బొమ్మనహాళ్: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం అమానుషమని ఉద్దేహాళ్ గ్రామస్తులు ఖండించారు. శుక్రవారం రాత్రి ముస్లింలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉద్దేహాళ్ బస్టాండ్ సర్కిల్‌లో మృతుల కుటుంబాలకు సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటిస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లింలు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గం టీ సర్కిల్‌లో సంతాపం తెలుపుతున్న ముస్లింలు



ఉద్దేహాళ్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

కూడేరు: ఉదిరిపికొండకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా అవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య తెలిపారు. పీఏబీఆర్ డ్యాం వద్ద నుంచి మండలంలోని గ్రామాలకు పైపులైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేసే ఉరవకొండ తాగునీటి ప్రాజెక్ట్ పైపులైన్‌కు జల్లిపల్లి వద్ద పెద్ద ఎత్తున లీకేజీలు ఏర్పడడంతో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య శుక్రవారం మరమ్మతు చేయించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సక్రమంగా నీటి సరఫరా కొనసాగితే ఎక్కడా నీటి సమస్య తలెత్తదన్నారు. పైపులైన్ లీకేజీలన్నింటినీ గుర్తించి మరమ్మతులు చేయించామని జేఈ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మండలంలో ప్రజలకు నీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. అత్యవసరమనుకుంటే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయిస్తామని తెలిపారు.



జల్లిపల్లి వద్ద తాగునీటి పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేయిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

బెళుగుప్ప: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ పెద్దన్న అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఇటీవల అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు పరిహారం అందేలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని, నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సభ్యులు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ మండలంలో 375 హెక్టార్లలో జరిగిన ఉద్యాన, వ్యవసాయ పంటల నష్టంపై నివేదికలు పంపామన్నారు. ఇన్‌పుట్ నివేదికలు సిద్ధం చేస్తున్నామని ఏఓ, హెచ్ఓలు పృథ్వీసాగర్, కృష్ణతేజ తెలిపారు. హౌసింగ్‌లో 1,157 ఇళ్లు మంజూరు కాగా ఎస్సీ, ఎస్టీలకు అదనపు బిల్లులు అందించనున్నట్లు హౌసింగ్ ఏఈ గోపీనాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేఖమ్మ, ఎంఈఓ మల్లారెడ్డి, వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, రుషికేష్, హెచ్ఓ కృష్ణతేజ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హర్షవర్ధన్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెద్దన్న